క్లుప్తంగా

అవంతిలో సంప్రదాయ దినోత్సవ వేడుకలు

అబ్దుల్లాపూర్‌మెట్‌: మండల పరిధిలోని గుంతపల్లి గ్రామంలో అవంతి ఇంజనీరింగ్ విద్యా సంస్థల ఆవరణలో బుధవారం సంప్రదాయ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అవంతి ఇంజనీరింగ్, సైంటిఫిక్ అండ్ రీసెర్చ్, ఫార్మసీ కళాశాల, మేనేజ్‌మెంట్ కళాశాలలకు చెందిన అధ్యాపకులు, విద్యార్థులు సాంప్రదాయ వస్త్రాలు ధరించి వేడుకలకు హాజరై విశేషంగా ఆకట్టుకున్నారు. దీంతో కళాశాలలో పండుగ వాతావరణం నెలకొన్నది. ఈ కార్యక్రమంలో ఆయా కళాశాలల ప్రిన్సిపల్స్ రామచంద్రారెడ్డి, వెంకటరెడ్డి, బాలాజీ, అజ్మత్‌హుస్సేన్, డైరెక్టర్ జయప్రద, అధ్యాపకులు, పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణే లక్ష్యం

ఎంపీడీఓ నరేందర్‌రెడ్డి



అయ్యవారిగూడెంలో నాటిన మొక్కలను పరిశీలిస్తున్న ఎంపీడీఓ నరేందర్‌రెడ్డి

యాచారం: పర్యావరణ పరిరక్షణే లక్ష్యంగా కృషి చేయాలని యాచారం ఎంపీడీఓ నరేందర్ రెడ్డి పేర్కొన్నారు. మండల పరిధిలోని తక్కళ్లపల్లి తండా, అయ్యవారిగూడెం, ఎనెకిందితండాలో బుధవారం మొక్కలు నాటే కార్యక్రమాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని 24 గ్రామ పంచాయతీల్లో 10వేల మొక్కలకు తక్కువ కాకుండా నాటాలని సూచించారు. మొక్కలు నాటే కార్యక్రమాన్ని ప్రతిఒక్కరూ ఛాలెంజ్‌గా తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏపీఓ లింగయ్య, ఈసీ శివశంకర్‌రెడ్డిలు పాల్గొన్నారు.

మల్‌రెడ్డి రాంరెడ్డిని కలిసిన టెస్కాబ్ వైస్ చైర్మన్



మల్‌రెడ్డి రాంరెడ్డి పుష్పగుచ్ఛం అందజేస్తున్న సత్తయ్య

తుర్కయంజాల్‌: రాష్ట్ర రోడ్డు కార్పొరేషన్ చైర్మన్ మల్‌రెడ్డి రాంరెడ్డిని బుధవారం ఆయన నివాసంలో టెస్కాబ్ వైస్ చైర్మన్, డీసీసీబీ చైర్మన్ కొత్తకుర్మ సత్తయ్య కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు తాటిచెట్టు అశోక్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

కేంద్రమంత్రి కిషన్‌రెడ్డిని కలిసిన నాయకులు



కిషన్‌రెడ్డితో బీజేపీ నాయకులు

ఆమనగల్లు: కేంద్ర బొగ్గు గనుల శాఖామంత్రి కిషన్‌రెడ్డిని బుధవారం ఆమనగల్లు మండలం పోలెపల్లి గ్రామానికి చెందిన బీజేపీ నాయకులు కలిశారు. హైదరాబాద్‌లోని బీజేపీ కార్యాలయంలో మంత్రి కిషన్‌రెడ్డిని జిల్లా బీజేవైఎం కార్యదర్శి ప్రభాకర్ ఆధ్వర్యంలో కలిసి ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు వెంకటేశ్, గోవింద్, వినోద్, మారం వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

చేపల పెంపకాన్ని ప్రోత్సహించాలి

తలకొండపల్లి: చేపల పెంపకాన్ని ప్రోత్సహించి, మత్స్యకారులకు ఆర్థిక భరోసా కల్పించాలని తలకొండపల్లి గ్రామ మత్స్య, పారిశ్రామిక శాఖల సంక్షేమ సహకార సంఘం సొసైటీ చైర్మన్ బోల యాదయ్య డిమాండ్ చేశారు. అన్యక్రాంతమైన చెరువులను పునరుద్ధరణకు చర్యలు తీసుకొని చేపల పెంపకాన్ని చేపట్టాలన్నారు. బుధవారం జాతీయ చేపల రైతుల దినోత్సవం సందర్భంగా మండల కేంద్రంలో యాదయ్య మాట్లాడారు. మత్స్యకారులు సామాజికంగా, ఆర్థికంగా, రాజకీయంగా, విద్య ఉద్యోగ, ఉపాధి, తదితర రంగాల్లో వెనుకబడి పోయారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. మత్స్యకారుల ఆర్థికాభివృద్ధికి ప్రత్యేక ప్యాకేజీ కెటాయించి వారి జీవితాల్లో వెలుగులు తీసుకువచ్చేందుకు కృషి చేయాలన్నారు.

ధ్వజ స్తంభానికి ప్రత్యేక పూజలు

తుర్కయంజాల్‌: తుర్కయంజాల్‌లోని హరిహర పుత్ర ఆంజనేయ స్వామి దేవాలయంలో బుధవారం ధ్వజ స్తంభానికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. దేవాలయం నిర్మాణంలో ఉండటంతో ఇప్పటికే ప్రధాన ఆలయ నిర్మాణ పనులు పూర్తయ్యాయని నిర్వాహకులు తెలిపారు. దాతలు సహకరించి ఆలయ నిర్మాణానికి సహకరించాలని కమిటీ సభ్యులు కోరారు.

వామ్మో..కోతులు!

- చీపునుంతల్లో స్వైరవిహారం
- బయటకు వెళ్లాలంటే జంకుతున్న ప్రజలు
- పట్టించుకోని అధికారులు



ఇంటి గోడపైన కూర్చున్న కోతి

తలకొండపల్లి: మండల పరిధిలోని చీపునుంతల్లో నిత్యం కోతుల బెడదతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. కొన్నాళ్లుగా గ్రామంలో కోతులు సంచరిస్తున్నాయి. ఒక ఇంటిపై నుంచి మరో ఇంటికి అవలీలగా దూకుతున్నాయి. అక్కడ ఇంట్లో ఉన్న వస్తువులను చిందర వందర చేసేస్తున్నాయి. దీంతో ఇంట్లో ఉండే వస్తువులకు రక్షణ లేకుండా పోతోంది. ఎప్పుడు ఎటు నుంచి కోతులు వస్తాయోనని స్థానిక ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. ఇంటి డాబాపైన ఏది ఆరబెట్టుకోలేక పోతున్నామని వాపోతున్నారు. ఒకవేళ ఏమైనా ఆరబెడితే అవి ఎత్తుకపోతున్నాయని స్థానికులు చెబుతున్నారు. కర్రలు పట్టుకొని కాపలా ఉంటే ఒక్కోసారి పైకి వచ్చి దాడులు చేసి వస్తువులను లాక్కెళ్లి పోతున్నాయి. గోడల మీద, ఇంటి ప్రహరీల మీద, గల్లీల్లో కోతులు సంచరిస్తున్నప్పుడు ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని ప్రజలు భయాందోళనలు చెందుతున్నారు. చిన్న పిల్లలు ఏ వస్తువునైనా తమ వెంట తీసుకొని వెళుతుంటే దాడి చేసి లాకెళ్లుతున్నాయి. దీంతో చిన్నారులు, వృద్ధులు బయట తిరుగాలంటే భయపడుతున్నారు. ఇంటి బయట బైక్‌లు, కార్లు పార్కింగ్ చేస్తే పెట్రోల్ ట్యాంక్ కవర్లు, సీట్ కవర్లను చింపేస్తున్నాయి. ఈ క్రమంలో వాహనాలను బయట నిలపాలంటే ప్రజలు ఆందోళనకు గురవుతున్నారు. అడవుల్లో ఉండాల్సిన కోతులు గ్రామాల్లో సంచరించి భయపెట్టి వస్తువులను లాకెళ్తున్నాయని స్థానికులు వాపోతున్నారు. తినుబండారాలు, ఆహారపదార్థాలు, పండ్లు, కొబ్బరి చిప్పలు, రొట్టె ముక్కలు కనిపిస్తే చాలు దాడి చేసి మరీ తీసుకెళుతున్నాయి. కోతుల నివారణ కోసం అధికారులు సైతం ఎలాంటి చర్యలు చేపట్టడం లేదు. మందలు, మందలుగా వచ్చి చేరడంతో తమ పరిస్థితి ఏంటని ప్రజలు అధికారులను ప్రశ్నిస్తున్నారు. తలుపులు తెరిచి ఉంచితే చాలు కోతులు ఇంట్లోకి వచ్చి హంగామా చేసేస్తున్నాయని ప్రజలు వాపోతున్నారు. ఇటీవల గ్రామస్థులు అందరూ డబ్బులు జమ చేసి కోతులను పట్టించి అడవుల్లో వదిలిపెట్టారు. అయినా మరలా ఎక్కడి నుంచి గుంపులుగా వస్తున్నాయో అర్థంకావడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తక్షణమే సంబంధిత అధికారులు స్పందించి కోతులను పట్టించి అడవులకు తరలించాలని కోరుతున్నారు.

ఇబ్బందిగా ఉంది..



కోతుల బెడద రోజురోజుకు ఇబ్బందిగా తయారైంది. దారి గుండా కూరగాయలు తీసుకొని వెళ్తున్నా వెంటపడి లాక్కెళ్తున్నాయి. ఏది కొనుక్కొని వెళ్లాలన్నా భయమేస్తుంది. అధికారులు స్పందించి కోతులను పట్టించి అడవుల్లో వదిలిపెట్టేలా చర్యలు తీసుకోవాలి.

–చెన్నకేశవులు, స్థానిక నాయకుడు, చీపునుంతల

గిరిజనుల సంక్షేమానికి కృషి చేయాలి

ఎస్టీ కార్పొరేషన్ చైర్మన్‌ను కలిసిన బీచ్యానాయక్



బెల్లయ్యనాయక్‌ను సన్మానించిన నాయకులు

కడ్తాల్‌: రాష్ట్ర ఎస్టీ కార్పొరేషన్ చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించిన తేజావత్ బెల్లయ్యనాయక్‌ను బుధవారం హైదరాబాద్‌లోని ఆయన కార్యాలయంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు బీచ్యానాయక్ ఆధ్వర్యంలో గిరిజన నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా బెల్లయ్యనాయక్‌ను గజమాలతో వారు సత్కరించి, శుభాకాంక్షలు తెలిపారు. గిరిజనుల సంక్షేమానికి కృషి చేయాలని, వారి అభివృద్ధికి పెద్ద మొత్తంలో కార్పొరేషన్ ద్వారా రుణాలు మంజూరు చేయాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు హీరాసింగ్, తుల్సీరాంనాయక్ తదితరులు పాల్గొన్నారు.

భవన నిర్మాణ పనులు పూర్తి చేయాలి



ఎంపీడీఓ బాల శంకర్‌కు వినతి పత్రం అందజేస్తున్న బీజేపీ నాయకులు

మంచాల: లోయపల్లి గ్రామంలో ఆగిపోయిన ప్రాథమిక ఆరోగ్య ఉప కేంద్ర భవన నిర్మాణ పనులు పూర్తి చేయాలని బీజేపీ నాయకులు కోరారు. బుధవారం మంచాల మండల కార్యాలయంలో ఎంపీడీఓ బాల శంకర్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత ప్రభుత్వం లోయపల్లి గ్రామంలో ప్రజలకు ఆరోగ్య సేవలు మరింత అందుబాటులోకి తీసుకురావాలని నూతనంగా ప్రాథమిక ఆరోగ్య ఉప కేంద్రం ఏర్పాటు చేసిందన్నారు. పూర్తి స్థాయిలో వినియోగంలోకి రావాలని భవన నిర్మాణానికి నిధులు కూడా మంజూరు చేసిందన్నారు. ఈ క్రమంలో నిర్మాణ పనులు మాత్రం మధ్యంతరంగా ఆగిపోయాయని తెలిపారు. దీనికి స్పందించిన ఎంపీడీఓ తగిన చర్యలు చేపడుతామని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు రాజు గౌడ్, శేఖర్, సురేష్, మహేష్, ముఖేష్ తదితరులు పాల్గొన్నారు.

డిమాండ్లు నెరవేర్చాలని ధర్నా



ఇబ్రహీంపట్నంలో నిరసన వ్యక్తం చేస్తున్న కార్మికులు



ఆమనగల్లు: నిరసన వ్యక్తం చేస్తున్న ఆశ కార్యకర్తలు

ఇబ్రహీంపట్నం: కార్మికుల సమస్యలను పరిష్కరించడంలో కేంద్ర ప్రభుత్వం పూర్తిగా విఫలం చెందిందని సీఐటీయూ నేతలు మండిపడ్డారు. దేశవ్యాప్తంగా బుధవారం కార్మికుల కోర్కెల దినంగా పాటించాలని ఇచ్చిన పిలుపులో బాగంగా సీఐటీయూ ఆధ్వర్యంలో ఇబ్రహీంపట్నంలో నిరసన నిర్వహించి స్థానిక ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డికి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా సీఐటీయూ రాష్ట్ర నాయకురాలు స్వప్న, మున్సిపల్ కన్వీనర్ ఎల్లేష్‌లు మాట్లాడుతూ బీజేపీ కేంద్రంలో మూడోసారి అధికారం చేపట్టిన అనంతరం ప్రైవేటికరణ దిశగా అడుగులు వేస్తుందన్నారు. బుగ్గరాములు, సరిత, శిరీష, బాలమణి, యాదమ్మ, పుష్ప, అనిత, సంతోష్‌కుమార్ పాల్గొన్నారు.

ఆమనగల్లులో..

ఆమనగల్లు: ఆశాకార్యకర్తలు, అంగన్‌వాడీ కార్యకర్తలు, మధ్యాహ్న భోజన కార్మికుల డిమాండ్లను ప్రభుత్వం అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో యాదమ్మ, కళమ్మ, వెంకటమ్మ, గీత, రాములమ్మ, శ్రీలత, సీఐటీయూ నాయకులు పెంటయ్య పాల్గొన్నారు.

యాచారంలో..



యాచారం: తహసీల్దార్ అయ్యప్పకు వినతి పత్రం ఇస్తున్న బ్రహ్మయ్య

యాచారం: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కనీస వేతనాలు అమలు చేయాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు పెండ్యాల బ్రహ్మయ్య డిమాండ్ చేశారు. సీఐటీయూ ఆధ్వర్యంలో యాచారం మండల తహసీల్దార్ కార్యాలయం ముందు ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రంలో మూడోసారి అధికారంలోకి వచ్చిన బీజేపీ ప్రభుత్వం ప్రయివేటీకరణను వేగవంతం చేసేలా కుట్రలు చేస్తుందన్నారు. కేంద్ర ప్రభుత్వం నిర్ణయాల వల్ల కార్మికులకు రక్షణ లేకుండా పోయిందన్నారు. అనంతరం తహసీల్దార్ అయ్యప్పకు పలు డిమాండ్లతో కూడిన వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ మండల కన్వీనర్ చందునాయక్, జంగయ్య, అండాలు, యాదమ్మ, సరిత, శోభ, వసంత, లలిత పాల్గొన్నారు.

తలకొండపల్లిలో..

తలకొండపల్లి: గ్రామ పంచాయతీ పారిశుద్ధ్య, ఆశా కార్మికుల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని సీఐటీయూ ఆమనగల్లు ఏరియా కన్వీనర్ జల్లెల పెంటయ్య డిమాండ్ చేశారు. అంగన్‌వాడీ, ఆశ, పారిశుద్ధ్య, మధ్యాహ్న భోజనం, ఐకెపి, విఓఏ, వైద్య, ఆరోగ్య, తదితర రంగాల్లో పని చేస్తున్న స్కీమ్ వర్కర్ల సమస్యలను తక్షణమే పరిష్కరించి వారికి సరైన న్యాయం చేయాలని కోరారు. మండల కేంద్రంలో బుధవారం పెంటయ్య ఆధ్వర్యంలో కార్మికులు నిరసన, ఆందోళన కార్యక్రమం చేపట్టారు. గ్రామ పంచాయతీ వర్కర్స్ మండల అధ్యక్షురాలు యాదమ్మ, సహాయ కార్యదర్శి అలివేలు, పెంటయ్య, తదితరులు పాల్గొన్నారు.

మంచాల: తమ సమస్యలను పరిష్కరించాలని అంగన్ వాడీ వర్కర్లు మంచాల తహసీల్దార్ వెంకట ప్రసాద్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అంగన్‌వాడీ వర్కర్ల సమస్యలపై రాష్ట్ర వ్యాప్త నిరసనలో భాగంగా వినతి పత్రం అందజేశామన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్ వాడీ వర్కర్లు వైదేవి, పద్మ, ఐలమ్మ, జయమ్మ, రజిత తదితరులు పాల్గొన్నారు.

భారతీయ కిసాన్ సంఘ్ నూతన కార్యవర్గం ఎన్నిక

కడ్తాల్‌: భారతీయ కిసాన్ సంఘ్ కడ్తాల్ మండల నూతన కార్యవర్గాన్ని బుధవారం మండల పరిధిలోని చల్లంపల్లి గ్రామంలో ఎన్నుకున్నారు. భారతీయ కిసాన్ సంఘ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాజిరెడ్డి, జిల్లా అధ్యక్షుడు గజేందర్‌గౌడ్, నాయకులు తీగల శ్రీధర్‌రెడ్డి సమక్షంలో నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా చల్లా అశోక్‌రెడ్డి, ఉపాధ్యక్షుడిగా శ్రీశైలం, కృష్ణ, ప్రధాన కార్యదర్శిగా మల్లికార్జున స్వామి, ఉప ప్రధాన కార్యదర్శిగా గూడూరు సురేందర్‌రెడ్డి, కోశాధికారిగా ఇక్బాల్‌పాషా, సహకార్యదర్శిగా మర్లమల్లేష్, నేనావత్ సూర్యనాయక్, సభ్యులుగా కృష్ణ, శేఖర్, రెడ్యానాయక్ తదితరులు నియమితులయ్యారు. అనంతరం నూతన కమిటీని సన్మానించారు.

ఆమనగల్లు పీఎస్‌లో డీసీపీ ఆకస్మిక తనిఖీ



పోలీసులకు సూచనలు చేస్తున్న డీసీపీ రాజేశ్

ఆమనగల్లు: ఆమనగల్లు పోలీస్ స్టేషన్‌ను బుధవారం శంషాబాద్ డీసీపీ బి రాజేశ్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పోలీస్ స్టేషన్‌లో పలు రికార్డులను చూశారు. అనంతరం పోలీస్ స్టేషన్ ఆవరణ, ఎస్ఐ క్వార్టర్స్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా పోలీసులకు డీసీపీ రాజేశ్ పలు సూచనలు చేశారు. పోలీస్ స్టేషన్ పనితీరుపట్ల సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఆమనగల్లు సీఐ ప్రమోద్‌కుమార్, ఎస్ఐ వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

పేద విద్యార్థులకు ఉప్పల ట్రస్టు చేయూత

తలకొండపల్లి: ప్రతిభ గల నిరుపేద విద్యార్థులకు చేయూతనందిస్తానని ఉప్పల చారిటబుల్ ట్రస్టు చైర్మన్, మిషన్ భగీరథ మాజీ వైస్ చైర్మన్, మాజీ జెడ్పీటీసీ ఉప్పల వెంకటేష్ పేర్కొన్నారు. వారి ఉన్నత చదువులకోసం అండగా ఉంటామని తెలిపారు. మండల పరిధిలోని అంతారానికి చెందిన అశోక్‌గౌడ్ మూడూ సంవత్సరాల క్రితం మృతి చెందాడు. దీంతో బాధిత కుటుంబం ఆర్థికంగా చితికి పోయింది. భార్య పుష్పమ్మ అనేక ఇబ్బందులకు గురవుతోందని, పోషణ భారం ఇబ్బందిగా ఉందని, పిల్లల స్కూల్ ఫీజు కట్టలేక అనునిత్యం మథనపడుతుండేది. కల్వకుర్తి నియోజకవర్గ గౌడ సంక్షేమ సంఘం తాలుకా కన్వీనర్ మొక్కురాల అశోక్‌గౌడ్ ఈ విషయాన్ని వెంకటేష్ దృష్టికి తీసుకెళ్లాడు. తక్షణమే స్పందించిన ఆయన పిల్లలిద్దరిని చదివిస్తానని హామీ ఇచ్చాడు. బుధవారం హైదరాబాద్‌లో ట్రస్టు సభ్యులచే రూ. 25,000 ఆర్థిక సాయం అందజేశాడు.

దేవాలయాల అభివృద్ధికి కృషి..

దేవాలయాల అభివృద్ధికి కృషి చేస్తానని ఉప్పల చారిటబుల్ ట్రస్టు చైర్మన్ ఉప్పల వెంకటేష్ పేర్కొన్నారు. ని చెన్నంపల్లిలో పోశమ్మ గుడి ఆలయ స్లాబ్ నిర్మాణానికి సిమెంట్, స్టీల్, తదితర మెటీరియల్‌ను ఆలయ నిర్వాహకులకు అందజేశారు.

మృతుని కుటుంబానికి సాయం..

ఆమనగల్లు: శెట్టిపల్లి గ్రామానికి చెందిన పెంటయ్య అనారోగ్యంతో మృతిచెందాడు. మృతుని కుటుంబాన్ని మాజీ సర్పంచ్ ఎగిరిశెట్టి సత్యం పరామర్శించారు. మృతుని భార్య వెంకటమ్మకు రూ.5 వేలు ఆర్థికసాయం అందజేశారు.

కాంగ్రెస్ ప్రభుత్వంపై బీఆర్ఎస్ కుట్ర

- ఉద్యోగాల భర్తీపై అసత్య ప్రచారం
- కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి

ఆమనగల్లు: రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వంపై బీఆర్ఎస్ కుట్ర రాజకీయాలు చేస్తుందని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి ఆరోపించారు. డీఎస్సీ, గ్రూప్ పరీక్షలు వాయిదా వేయాలంటూ దళిత, గిరిజన విద్యార్థులను రెచ్చగొట్టి ఉద్యోగ నియామకాలను అడ్డుకోవడానికి బీఆర్ఎస్ ప్రయత్నిస్తుందని ఆయన ఆరోపించారు. బీఆర్ఎస్ నాయకుల మాటలను నమ్మి నిరుద్యోగులు, విద్యార్థులు తమ భవిష్యత్తును నాశనం చేసుకోవద్దని ఆయన సూచించారు. ఆమనగల్లు పట్టణంలో బుధవారం రూ.17.50 కోట్లతో నిర్మించనున్న 50 పడకల ఆసుపత్రి నూతన భవన నిర్మాణానికి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి భూమిపూజ చేశారు. అనంతరం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీల మేరకే ఉద్యోగాలను భర్తీ చేస్తుందని చెప్పారు. పదేళ్ల అధికారంలో ఉన్న బీఆర్ఎస్ నిరుద్యోగులను మోసం చేసిన విషయాన్ని గుర్తు చేశారు. బీఆర్ఎస్ హయాంలో ఉపాధ్యాయుల ప్రమోషన్లు, బదిలీలు చేపట్టలేదని, సీఎం రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో ఉపాధ్యాయులకు న్యాయం చేశారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం విద్య, వైద్య రంగాలకు అధిక ప్రాధాన్యత ఇస్తుందని ఎమ్మెల్యే చెప్పారు. కల్వకుర్తి నియోజక వర్గ అభివృద్ధికి సీఎం రేవంత్‌రెడ్డి సానుకూలంగా ఉన్నారన్నారు. ఆమనగల్లులో ప్రభుత్వ జూనియర్ కళాశాల భవనంతో పాటు డిగ్రీ కళాశాల భవనం, పాలిటెక్నిక్ కళాశాల భవనం నిర్మిస్తామని చెప్పారు. రూ.20 కోట్లతో ఇంటిగ్రేటెడ్ స్కూల్ కాంప్లెక్స్ నిర్మాణానికి భూమి సేకరిస్తున్నట్లు ఆయన వివరించారు. స్కిల్ డెవలప్‌మెంట్ యూనివర్సిటీ ఏర్పాటు కోసం అనువైన 150 ఎకరాల స్థల పరిశీలన చేస్తునట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో డీసీహెచ్ఎస్ డా.రాజు, డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్ఓ డాక్టర్ గీత, వైద్య విధానపరిషత్ డీఈ రవీందర్, రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి సభ్యులు బాలాజీసింగ్, డీసీసీబీ డైరెక్టర్ గంప వెంకటేశ్, మున్సిపల్‌చైర్మన్ రాంపాల్‌నాయక్, వైస్ చైర్మన్ దుర్గయ్య, డాక్టర్లు నాగరాజు, పరిక్షిత్‌నరేందర్, జయశ్రీ, ఎంపీహెచ్ఈఓ తిరుపతిరెడ్డి, సీఐ ప్రమోద్‌కుమార్, ఎస్ఐ వెంకటేశ్, తహసీల్దార్ లలిత, స్థానిక నాయకులు ప్రభాకర్‌రెడ్డి, కొండల్‌రెడ్డి, వస్పుల జంగయ్య, శెట్టిపల్లి సత్యం, నిట్టె నారాయణ, జగన్, మానయ్య, అప్పం శ్రీను, భాస్కర్‌రెడ్డి, వేణుగోపాల్, బాబా, మల్లయ్య, రామకృష్ణ, కృష్ణనాయక్, ఖలీల్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే పరామర్శ..

రెండు రోజుల క్రితం మృతిచెందిన అరబిందో స్కూల్ ప్రిన్సిపల్ వర్కాల రమణారెడ్డి కుటుంబ సభ్యులను ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి పరామర్శించారు. ఈ సందర్భంగా 61 సంవత్సరాలు నిండిన వీఆర్ఏల వారసులకు ఉద్యోగ నియామక ఉత్తర్వులు ఇవ్వాలని ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డికి వీఆర్ఏలు శ్రీనివాస్, రామచంద్రయ్య, రాములు, నారాయణ, కృష్ణయ్య, రాధాకృష్ణ, ఎల్లయ్యలు వినతిపత్రం అందించారు. అదేవిధంగా ఆమనగల్లులో నిర్వహించే వనమహోత్సవం కార్యక్రమానికి హాజరు కావాలని ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డిని ఎంపీడీఓ కుసుమమాధురి కోరారు.

డీఈఈ దానయ్య మృతికి సంతాపం



దానయ్య మృతదేహానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి, నాయకులు

కడ్తాల్‌: వనపర్తి జిల్లా ఆర్అండ్‌బీ డీఈఈగా విధులు నిర్వహిస్తున్న కడ్తాల్ మండల కేంద్రానికి చెందిన ఎగిరిశెట్టి దానయ్య మృతి పట్ల పలువురు ప్రజాప్రతినిధులు, నాయకులు, అధికారులు సంతాపం వ్యక్తం చేశారు. వనపర్తి ఆర్అండ్‌బీ డీఈఈగా పనిచేస్తున్న దానయ్య కొంత కాలంగా తీవ్ర అనారోగ్యంతో చికిత్స పొందుతూ మృతిచెందాడు. బుధవారం కడ్తాల్ మండల కేంద్రంలో దానయ్య అంత్యక్రియలు నిర్వహించారు. అంతకు ముందు దానయ్య పార్థీవదేహాన్ని రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు జిల్లెల చిన్నారెడ్డి, ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి, దేవరకద్ర మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి, రాష్ట్ర కాలుష్య నియంత్రణ బోర్డు సభ్యుడు బాలాజీసింగ్, ఆర్అండ్‌బీ శాఖ వనపర్తి జిల్లా అధికారులు సందర్శించి నివాళులర్పించారు. పరామర్శించిన వారిలో డీసీసీబీ డైరెక్టర్ వెంకటేశ్ గుప్తా, మాజీ జెడ్పీటీసీ దశరథ్‌నాయక్, మాజీ వైస్ ఎంపీపీ ఆనంద్, మాజీ సర్పంచ్ లక్ష్మీనర్సింహరెడ్డి, డీసీసీ అధికార ప్రతినిధి శ్రీనివాస్‌రెడ్డి, బ్లాక్‌కాంగ్రెస్ అధ్యక్షుడు నర్సింహ, సింగిల్‌విండో డైరెక్టర్ వెంకటేశ్, నాయకులు బీక్యానాయక్, కడారి రామకృష్ణ, భాస్కర్‌రెడ్డి, జహంగీర్‌బాబా, హన్మానాయక్, రాఘవేందర్, చందోజీ, కృష్ణ, బీసీ సంఘం అధ్యక్షుడు వెంకటేశ్, అధికారులు తదితరులు ఉన్నారు.

నాణ్యమైన విద్యా బోధనే లక్ష్యం

జిల్లా గిరిజన సంక్షేమ సహాయ అధికారి వెంకటయ్య



విద్యార్థుల సామర్థ్యాన్ని పరిశీలిస్తున్న వెంకటయ్య

కడ్తాల్‌: గిరిజన సంక్షేమ, ఆశ్రమ పాఠశాలల్లో నాణ్యమైన విద్యా బోధనే లక్ష్యమని జిల్లా గిరిజన సంక్షేమ సహాయ అధికారి ఉడుతనూరి వెంకటయ్య పేర్కొన్నారు. బుధవారం మండల కేంద్రంలోని గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలతో పాటు, గిరిజన సంక్షేమ శాఖ బాలుర వసతిగృహాన్ని ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయా రికార్డులను, విద్యార్థుల, ఉపాధ్యాయుల హాజరు పట్టిక, వంట గది, పాఠశాల పరిసరాలను పరిశీలించారు. వసతిగృహ విద్యార్థులతో పాటు, ఆశ్రమ పాఠశాల విద్యార్థులకు అందిస్తున్న ఆహారం, బెడ్‌షీట్స్, కార్పెట్స్, దుస్తులు, నోట్‌బుక్స్ పంపిణీకి సంబంధించిన వివరాలను వసతిగృహ సంక్షేమాధికారి రాములును అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన ఆహారం అందించాలని పేర్కొన్నారు. అనంతరం విద్యార్థుల విద్యా సామర్థ్యాన్ని పరిశీలించి, విద్యా ప్రమాణాలు మరింత మెరుగుపడేలా విద్యాబోధన చేయాలని పాఠశాల ఉపాధ్యాయులకు సూచించారు.

ఉపాధ్యాయులు పాఠశాలకు సకాలంలో హాజరుకావాలని, విద్యార్థులు వ్యక్తి గత పరిశుభ్రతపై దృష్టి సారించేలా వారికి ప్రత్యేక అవగాహన కల్పించాలన్నారు. పాఠశాల ఆవరణలో దోమలు, ఈగల బెడద లేకుండా పాఠశాల, వసతిగృహ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. వృథా నీరు నిల్వ ఉండకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేయాలని వసతిగృహ సంక్షేమాధికారి రాములుకు సూచించారు.

వీఆర్వోలకు న్యాయం చేయాలని వినతి



వినతిపత్రం ఇస్తున్న వీఆర్వో సంఘం నేతలు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి

ఇబ్రహీంపట్నం: మాతృసంస్థలోకి తీసుకొని వీఆర్వోలకు న్యాయం చేయాలని ఆ సంఘం నేతలు బుధవారం ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సంఘం నేతలు శ్రీరాములు, జగదీశ్, దయానంద్, గణేశ్‌లు మాట్లాడుతూ గత బీఆర్ఎస్ ప్రభుత్వం తమను వాడుకొని లాభపడిందని, ఆ తదుపరి వీఆర్వోలు అవినీతి ఆరోపణలకు పాల్పడుతున్నారని, తమను నిర్లక్ష్యంగా తొలగించి ఇతర శాఖల్లోకి తీసుకొని అవమానాలకు గురిచేశారన్నారు. రేవంత్‌రెడ్డి పాదయాత్ర చేస్తున్న సందర్భంలో వీఆర్వోలకు జరిగిన అన్యాయాన్ని గుర్తించి న్యాయం చేస్తానని హామీ ఇచ్చిన విషయాన్ని వారు గుర్తు చేశారు. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే ధరణి సైట్‌ను ఎత్తివేస్తామని, వీఆర్వోలకు న్యాయం చేస్తామని రేవంత్‌రెడ్డి చెప్పారన్నారు. తమ సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి తగిన న్యాయం చేయాలని ఎమ్మెల్యేతో మొరపెట్టుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం నేతలు నగేష్, యాదగిరి, దశరథ, జంగయ్య, ముత్యాలు, నర్సింహ్మారెడ్డి, వెంకటేశ్, కృష్ణలు పాల్గొన్నారు.

రిటైర్డ్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరిస్తా: ఎమ్మెల్యే

ప్రభుత్వ రిటైర్డ్ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషిచేస్తానని ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి అన్నారు. ఇబ్రహీంపట్నంలో ఉద్యోగ విరమణ చేసిన ఉద్యోగులు బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఉద్యోగులందరూ కాంగ్రెస్ అధికారంలోకి వచ్చేందుకు ఎంతో కృషిచేశారన్నారు. ఉద్యోగ విరమణ చేసిన ఉద్యోగుల సమస్య రాష్ట్ర వ్యాప్తంగా ఉందని, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దృష్టికి ప్రత్యేకంగా తీసుకెళ్లి పరిష్కారానికి పాటుపడుతానన్నారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం అధ్యక్షుడు అశోక్‌కుమార్, మున్సిపల్ చైర్‌పర్సన్ కప్పరి స్రవంతి, వైస్ చైర్ పర్సన్ మంగ, పలువురు రిటైర్డ్ ఉద్యోగులు పాల్గొన్నారు.